- కాంగ్రెస్, బీజేపీ నేతలపై కేసీఆర్ ఫైర్
- 24 ఏండ్ల సంది దమ్ము లేకుంటేనే పోరాటం చేస్తున్నమా?
- రాజకీయం అంటే ఇలాంటి సవాళ్లేనా
- ఇంతకాలం నా పోరాటం సాగింది..
- ఇక చేయాల్సిందే ప్రజలే
- ఆగం కావద్దు, గాయి గాయి కావద్దు
- అచ్చంపేట ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

# ఈ సిపాయిలంతా అప్పుడేరీ?



- దమ్ముందా రా.. అంటే అర్థం ఏంటిది

తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన సమయంలో కన్పించని వారంతా ఇవాళ దమ్ముందా.. రా! అంటూ సవాళ్లు చేస్తున్నారని సీఎం కేసీఆర్ విమర్శలు చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చేసిన సవాల్ పై ఘాటుగా స్పందించారు. కొడంగల్ లో పోటీ చేయాలని సీఎం కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేసీఆర్ తన సవాల్ కు స్పందించకపోతే గజ్వేల్ లో పోటీ చేయాలని పార్టీ నాయకత్వం ఆదేశిస్తే పోటీ చేస్తానని గురువారం ప్రకటించారు. కాగా, నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సవాల్ పై సెటైరికల్ గా స్పందించారు. తెలంగాణ కోసం తాను బయలుదేరి 24 ఏళ్లు అయిందన్నారు. తాను తెలంగాణ కోసం బయలుదేరిన సమయంలో ఈ సిపాయిలంతా ఎవరూ లేరన్నారు. తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన నాడు లేని వారంతా ఇవాళ తనకు సవాళ్లు విసురుతున్నారన్నారు. కొంతమంది ఇప్పుడొచ్చి కేసీఆర్ కు దమ్ముందా? అని అంటున్నారని అన్నారు. కొడంగల్ కు రా, గాంధీ బొమ్మ దగ్గరకు రా.. అని సవాళ్లు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు.

**కొడంగల్‌కు వస్తవా.. కొడవలి పట్టుకు వస్తవా?**

కొడంగల్ కు కొడవలి పట్టుకు వస్తావా? అని తనను సవాల్ చేస్తున్నారని రేవంత్ రెడ్డిపై కేసీఆర్ పరోక్షంగా విమర్శలు చేశారు. రాజకీయమంటే ఇలాంటి సవాళ్లా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ సాధన కోసం తాను ఒక్కడినే పక్షిలా తిరిగినట్టుగా సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. కొడంగల్ కు, గాంధీ బొమ్మకు రావాలని సవాల్ చేస్తున్న సిపాయిలంతా ఆనాడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా తాను పోరాటం చేశానన్నారు. ఇ కపై పోరాటం చేయాల్సింది మీరేనని ప్రజలను కోరారు. 24 గంటలు కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని గుర్తు చేశారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ కూడా 24గంటల కరెంట్ లేదన్నారు. కర్ణాటకలో కరెంట్ ఇచ్చే దిక్కే లేదని కేసీఆర్ విమర్శించారు. కర్ణాటక రైతులు కొడంగల్, గద్వాలకు వచ్చి ధర్నాలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు.

**రైతు బంధు పథకం సృష్టికర్తను నేనే..**

తెలంగాణ వచ్చిన తర్వాత ఒక్కొక్క సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నట్టుగా సీఎం కేసీఆర్ అన్నారు. రైతు బంధు అనే పథకాన్ని సృష్టించింది తానేనన్నారు. దశల వారీగా పెన్షన్ ను రూ. 5 వేలకు పెంచుకుంటూ పోతామని ప్రకటించారు. మనకు కులం, మతం లేదు... ఉన్నది తెలంగాణ ఒక్కటేనని అన్నారు. ఎన్నికల సమయంలో ఆగం కావద్దని ప్రజలను కోరారు. ఎవరో చెప్పారని ఓటు వేయవద్దని ఆయన సూచించారు. ఎవరి కారణంగా తెలంగాణ బాగుపడిందో చూసి ఓటేయాలన్నారు.

**కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి ఎత్తేస్తరట..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ కుక్కలు చింపిన విస్తరిగా మారుతుందని సీఎం కేసీఆర్ అన్నారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకుంది కాంగ్రెస్ నేతలేనని అన్నారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టింది, కాంగ్రెస్ కాదా అని ఆయన ప్రశ్నించారు. ధరణి వల్లే రైతు బంధు నిధులు సకాలంలో రైతులకు అందుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని ఎత్తివేస్తామని చెబుతున్నారన్నారు. తాను రెస్ట్ తీసుకుంటానని చెప్పారు. కానీ ప్రజలకే నష్టమని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. స్థిరంగా ఆలోచించి ఓటేయాలని ఆయన ప్రజలను కోరారు.

# కేసీఆర్ పథకాలపై కుట్ర

- రైతు బంధు వద్దంట
- నిలిపివేయాలని ఈసీకి ఫిర్యాదు దారుణం
- దుర్మార్గానికి పరాకాష్ఠ.. అది రద్దుల పార్టీ
- బీజేపీతో మ్యాచ్ ఫిక్సింగ్
- ప్రజలు ఉద్యమించి, తిరగబడాలి
- అభ్యర్థులను నిలదీయండి
- కాంగ్రెస్‌పై మంత్రి జగదీష్ రెడ్డి ఆగ్రహం

(ప్రభన్యూస్ బ్యూరో, సూర్యాపేట)

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల రద్దుకు కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నుతోందని.. రైతులకు భరోసాగా నిలిచే.. రైతు బంధు అమలను నిలిపివేయాలని ఈసీ కి పిర్యాదు చేయటం.. కాంగ్రెస్ పార్టీ దుర్మార్గానికి పరాకాష్ట అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. . సూర్యాపేటలో గురువారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పై నిప్పులు చెరిగారు. .కాంగ్రెస్ రద్దుల పార్టీ అని ఎద్దేవ చేశారు. రైతుల అవసరాలను సకాలంలో తీర్చే రైతు బంధు అమలును నిలిని వేయాలని ఫిర్యాదు చేయటం దుర్మార్గం అన్నారు. కాంగ్రెస్ ఉక్రోశం చర్యల పై ప్రజలు ఉద్యమించి , తిరగబడాలని, గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను నిలదీయండని ప్రజలకు పిలుపు నిచ్చారు. ఉచిత విద్యుత్తు , మిషన్ భగీరథనూ అడ్డుకునేలా కాంగ్రెస్ తీరు ఉందన్నారు. .కేసీఆర్ పథకాలు నిలనాలని కుట్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఆదర్శ పథకాల అమలు తీరును ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారని భయం పట్టుకుందని మంత్రి వివరించారు.
కర్ణాటకలో ఏకంగా కరెంట్ కోసం సబ్ స్టేషన్లలో మొసళ్ళు వదిలే దుస్థితి వచ్చిందన్నారు.
కాంగ్రెస్ పార్టీ పద్దుల పార్టీ కాదు.. రద్దుల పార్టీ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా కేసీఆర్ పథకాలు లేవన్నారు. ఇక్కడ కేసీఆర్ పథకాలు ఆపేస్తే దేశంలో ఎక్కడా పంచాయతీ ఉండదని కుట్ర జరుగుతోందని అన్నారు. ఇందుకు కాంగ్రెస్ , బీజేపీ ఒకటే ఎజెండా తో పని చేస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనించాలని మంత్రి సూచించారు. పోటీచేసే అభ్యర్థులని కాంగ్రెస్ , బీజేపీ ఇచ్చిపుచ్చుకుంటున్నాయనీ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని ఎదగనీయకుండా కాంగ్రెస్ , బీజేపీ కుట్ర చేస్తున్నాయన్నారు. ప్రజల కోసం పనిచేసే పార్టీని ప్రజలు గుర్తించాలన్నారు. బీజేపీ కి రెండు సార్లు అధికారం ఇస్తే దేశాన్ని ఆకలి రాజ్యంగా మార్చిందని, బీజేపీ పాలనలో పెనం నుంచి పొయ్యిలో పడిన చందంగా దేశ ప్రజల పరిసితి మారిందన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అడుగుతున్న బీజేపీ కి అసలు అభ్యర్థులే లేరని ఎద్దేవా చేశారు. ఈసీ కి ఫిర్యాదుతో రైతాంగం పట్ల కాంగ్రెస్ పార్టీ కపట ప్రేమ బట్టబయలైందన్నారు.




## ఇంటింటికీ మంచినీళ్లు, నిరంతర కరెంటూ వద్దంటారేమో



- కాంగ్రెస్ అంటేనే రైతు విరోధి
- రైతు బంధును నిలిపివేయటం
- అన్నదాతల పొట్టకొట్టే కుతంత్రం
- కాంగ్రెస్‌పై మంత్రి కేటీఆర్ ఫైర్..

రైతుబంధు అమలును నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేయడంపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు విరోధి అని మరోసారి రుజువైందని మంత్రి కేటీఆర్ విమర్శించారు. ప్రజాక్షేత్రంలో ఆ పార్టీకి గుణపాఠం తప్పదని స్పష్టం చేశారు. . 'రైతుబంధు' నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంపై సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై మాటల తూటాలు పేల్చారు. ఇంటింటికీ మంచినీళ్లు, నిరంతర కరెంటు కూడా వద్దంటారేమో ? అందులో కూడా కేసీఆరే కనిపిస్తారు కదా? అన్నదాత పాలిట నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీ అని ఇంకోసారి తేలిపోయింది. పెట్టుబడి సాయాన్ని అడ్డుకునే కపట కుట్రను తెలంగాణ రైతులు సహించరు. అన్నదాతల పొట్టకొట్టే కాంగ్రెస్ కుతంత్రాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తెలంగాణ రైతులు భరించరు అని కేటీఆర్ కామెంట్ చేశారు. రైతుబంధును నిలిపివేయాలని లేఖలు రాస్తున్న కాంగ్రెస్ తోకలు కట్ చేయడం పక్కా. ఇప్పటికే నమ్మి ఓటేసిన పాపానికి కర్ణాటక రైతులు అరిగోస పెడుతున్నారు. తెలంగాణ రైతులకు కడుపునిండా కరెంట్ ఇస్తే ఓర్వలేక 3 గంటల మోసానికి తెర తీశారు. రైతుబంధు పథకానికి కూడా పాతరేసే ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని మంత్రి కేటీఆర్ ట్విట్లర్ లో కాంగ్రెస్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## సంతోషంగా బతుకుతున్నాం

- తెలంగాణ సర్కారు అన్నీ ఇచ్చింది
- సీఎం కేసీఆర్, నేను మీ వెంటే ఉంటాం
- మంత్రితో ఓఇల్లాలు ముచ్చట



మహబూబ్ నగర్, అక్టోబర్ 26 (ప్రభ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం.. పాలకొండలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంటింటా ఎన్నికల ప్రచారం లో భాగంగా కాలనీలోని ఓ ఇంటికి వెళ్లగా.. అక్కడ ఆసక్తికర సంఘటన ఆకట్టుకుంది. . పాలకొండలో తిరుపతమ్మ అనే ఇల్లాలి ఇంటికి మంత్రి వెళ్లారు. ఆ సమయంలో ఆమె కట్టెల పొయ్యిపై వేడివేడిగా జొన్న రొట్టెలు కాల్చుతూ కనిపించింది. అయ్యో తిరుపతమ్మ గ్యాస్ ధర ఎక్కువైందని కట్టెల పొయ్యి మీద చేస్తున్నావా... మోడీ పెంచిన గ్యాస్ ధరను మేం భరించి మీకు జనవరి నుంచి రూ. 400లకే ఇస్తాం, ఇక మీకు కట్టెల పొయ్యి నుంచి విముక్తి కలిగినట్టే అన్నారు. అనంతరం మంత్రి కొద్ది సేపు పెనంపై రొట్టెలను కాల్చి సాయం చేశారు. పొద్దున్నే ఇంటికి వచ్చిన మంత్రికి తిరుపతమ్మ వేడివేడి రొట్టెలు అందించగా రొట్టె తింటూ మంత్రి ఆమెతో ముచ్చటించారు. తాము తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అనేక పథకాలతో లబ్ది పొందామని తిరుపతమ్మ మంత్రికి తెలిపింది. కచ్చితంగా తాము కారు గుర్తుకే ఓటేస్తామనీ హామీ ఇచ్చింది.. ఒక్క తమ ఇంటికే రైతుబంధు, రైతు రుణమాఫీ, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్ వస్తోందని తెలిపింది. 24 గంటల ఉచిత కరెంటుతో సంతోషంగా వ్యవసాయం చేస్తున్నామని వివరించింది. 2014కు ముందు ట్యాంకర్ తో నీళ్ళు వచ్చేవని, తాగునీళ్ల కోసం గొడవపడే పరిస్థితి ఉండేదని, బల మున్నోళ్లకే నీళ్లు దొరికేవని వాపోయింది. ఇప్పుడు ఆనాటి కష్టాలు లేవని , ఇంటికే నేరుగా నల్లా నుంచి మంచినీళ్లు వస్తున్నాయని, ఎంతో సంతోషంగా ఉన్నామని పేర్కొంది. సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్ గౌడ్ కు తాము అండగా ఉంటామని తెలిపింది. భవిష్యత్తులోనూ ఊహించని విధంగా అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చి .. అక్కడి నుంచి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో మంత్రి వెంటే స్థానిక కౌన్సిలర్ నరేందర్,బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 100 సీట్లలో గెలుస్తాం



- తెలంగాణలో మళ్లీ అధికారం మాదే..
- ఈ ఎన్నికలు రాహుల్ వర్సెస్ రైతులు
- బీజేపీకి అస్సలు స్కోప్ లేదు
- గాంధీలపై ప్రజల్లో విశ్వసనీయత లేదు
- మీడియాతో ఎమ్మెల్సీ కవిత చిట్‌చాట్

ఈ ఎన్నికలు రాహుల్ గాంధీ, రైతులకు మధ్య జరుగుతున్న ఎన్నికలు అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. రైతుబంధు ఆపాలన్న కాంగ్రెస్ పార్టీకి రైతులు తగినబుద్ధి చెప్తారన్నారు. పేదలకు రేషన్ బియ్యం, ఆసరా పెన్షన్లు, బీడీ పెన్షన్లు, మిషన్ భగీరథ తాగునీరు, ఇండ్లకు, పరిశ్రమలకు 24 గంటల కరెంట్, షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి ఈ పథకాలన్నింటినీ ఎన్నికల కోడ్ పేరు చెప్పి ఆపేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందా..? దీనికి రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. నిజామాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ, నాలుగు ఓట్ల కోసం ప్రజల కడుపు కొట్టె నీచమైన దుర్మార్గానికి కాంగ్రెస్ తెరలేపింది అని కవిత మండిపడ్డారు. కాంగ్రెస్ ఆరోపణలు చూస్తే వాళ్ల అభద్రతా భావం కనిస్పిస్తుందని, అందుకే సంక్షేమ పథకాలు ఆపే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కోరుట్లలో ఓడిస్తామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. రేవంత్ రెడ్డి కామారెడ్డి నుంచి, ఈటల రాజేందర్ గజ్వేల్‌లో పోటీ చేసిన తమ పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ లాగా పేర్లు మార్చి పథకాలు పెట్టడం లేదన్నారు. యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్ అనే కాంగ్రెస్ హామీ.. ఎన్నికల హామీ మాత్రమే అని కవిత స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జాబ్ క్యాలెండర్ ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం చేసిన పార్టీ కాంగ్రెస్ అని కవిత ధ్వజమెత్తారు.

## రాజమండ్రి సెంట్రల్ జైలుకు రాంగోపాల్ వర్మ!




వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ.. టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబును టార్గెట్ చేయడంలో ఆయన రూటే సపరేటు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్ట్ అయి జైలు పాలైనప్పటినుండి చంద్రబాబును టార్గెట్ చేస్తూ రాంగోపాల్ వర్మ సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడుతున్నారు. చంద్రబాబును డిమెరిట్ చేసేలా, జగన్ కు హైప్ క్రియేట్ చేసేలా వ్యూహం సినిమాతో రాంగోపాల్ వర్మ రచ్చ చేస్తున్నారు.తాజాగా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో పర్యటించిన వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మ రాజమండ్రి సెంట్రల్ జైలు ఎదుట సెల్ఫీ తీసుకున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబు ఉన్నాడన్న విషయం తెలిసిన ఆయన కావాలని రాజమండ్రి సెంట్రల్ జైలు ముందుకు వెళ్లి సెల్ఫీ తీసుకొని చంద్రబాబును టార్గెట్ చేశారు. ఆ ఫోటోను సోషల్ మీడియాలో ట్వీట్ చేసిన ఆయన నేను రాజమండ్రి సెంట్రల్ జైలు బయట ఉంటే, ఆయన సెంట్రల్ జైలు లోపల ఉన్నారు అంటూ ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేశారు.

## తెలంగాణలో వారాహి యాత్ర !



తెలంగాణలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో... బీజేపీతో సఖ్యత కుదిరితే తెలంగాణలో జనసేనాని వారాహి యాత్రకు తన రథాన్ని సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీకి మద్దతు గా ఎన్నికల్లో శంఖారావం పూరించనున్నారు. ఎన్నికల కాలం తరుముతుంటే.. . ఓ వైపు అభ్యర్థుల జాబితాలను విడుదల చేస్తూనే.. తమతో కలిసే జతగాళ్లతో పొత్తుల ప్రయత్నం చేస్తున్నాయి.ఇప్పటికే తామూ కలిసి పోటీ చేయాలని బీజేపీ, జనసేన నిర్ణయించుకున్నాయి.. తాజాగా.. ఢిల్లీ వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షాతో జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ భేటీ అయ్యారు. తెలంగాణలో బీజేపీజనసేన పొత్తు, సీట్ల సర్దుబాటుపై అమిత్ షాతో చర్చించారు. పవన్ కల్యాణ్ వెంట తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఉన్నారు. ఇప్పటికే.. కిషన్‌రెడ్డి, లక్ష్మణ్.. పవన్ కల్యాణ్‌ను కలిసి తెలంగాణలో బీజేపీకి మద్దతివ్వాలని కోరారు. జనసేనకు కేటాయించే సీట్లపై ఇంకా క్లారిటీ రాలేదు. ఐతే, పొత్తుల విషయం తేలగానే తెలంగాణాలో జనసేన అధిపతి పవన్ కల్యాణ్ వారాహి యాత్ర చేపడుతారని .. జనసేన, బీజేపీ శ్రేణుల్లో వినిపిస్తోంది..

## పార్టీ మారే ప్రసక్తే లేదు

- తప్పుడు వార్తలపై పరువు నష్టం దావా వేస్తా
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



పార్టీ మారుతున్నానని తనపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీ లో చేరుతునట్లు మీడియాలో వస్తున్న వార్తలను ఆమె తీవ్రంగా ఖండించారు. భారతీయ జనతా పార్టీలో కొందరు సీనియర్లు పోటీ చేయడానికి సముఖంగా లేరని, మరి కొందరు పార్టీ మారతారని జోరుగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో డీకే అరుణ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రసక్తి లేదని క్లారిటీ ఇచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు కావాలని మైండ్ గేమ్ ఆడుతున్నారని డీకే అరుణ మండిపడ్డారు. భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం తనను గుర్తించి జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పని చేయటం అదృష్టమని డీకే అరుణ అన్నారు. కనీసం తన స్పందన తీసుకోకుండా వార్త కథనాలు రాయడం సరైంది కాదని డీకే అరుణ మండిపడ్డారు. తన రాజకీయ భవిష్యత్ ను నిర్ణయించే హక్కు ఎవరు ఇచ్చారని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ లో తన చేరికపై మీడియా ప్రచారంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై దుష్ప్రచారం చేసిన మీడియా సంస్థలపై పరువు నష్టం దావా వేస్తానని డీకే అరుణ హెచ్చరించారు. ఇటీవల తెలంగాణ బీజేపీ ఎలక్షన్ స్క్రీనింగ్ కమిటీ ఛైర్మన్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేశారు. గత కొంతకాలంగా ఆయన నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దానికి తగ్గట్టుగా బీజేపీ విడుదల చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల తొలి జాబితాలో ఆయన పేరు కనిపించలేదు. ఈ క్రమంలో వారం రోజుల కిందటే పార్టీ మార్పుపై ఆయన హింట్ ఇచ్చారు. కమలాన్ని వదలికి మళ్లీ హస్తం గూటికి చేరనున్న రాజగోపాల్‌రెడ్డి.. రాజీనామా చేస్తూనే బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్‌కి ప్రత్యామ్నాయం బీజేపీ కాదన్నారు తన మాదిరిగానే చాలా మంది నేతలు కూడా త్వరలోనే బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలోనే తనపై వస్తున్న పుకార్లపై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఘాటుగా స్పందించారు.